RNI NO:APTEL/2018/76747

# నవతరం

తెలుగు దిన పత్రిక

NAVATARAM TELUGU DAILY

ఎడిటర్ : శిరిగిరి వరదరాజు

పబ్లిషింగ్ : రాజమహేంద్రవరం | సంపుటి : 11 | సంచిక : 231 | AP/TEL/2018/76747 | మంగళవారం 9-12-2025 | పేజీలు : 04 | వెల : 01 రూ..

Published From: Srikakulam, Parvathipuram Manyam,Vizianagaram,Visakhapatnam,Alluri Sitharama Raju,Anakapalli,Kakinada,East Godavari ,Konaseema,Eluru,West Godavari,NTR,Krishna,Guntur,Bapatla,Nellore,Prakasam,Kurnool,Nandyal,Sri Sathya Sai,YSR,Annamayya,Tirupati,Chittoor




## డీజీసీఏ నోటీసులపై ఇండిగో స్పందన

ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు

విమానాల రద్దుకు ప్రాథమికంగా ఐదు కారణాలు వెల్లడి

పూర్తిస్థాయి విశ్లేషణకు మరింత సమయం కావాలని వినతి



300 వార్డులుగా

## జీహెచ్ఎంసీ

వార్డుల పునర్ నిర్ధారణకు

సర్కారు ఆమోదం.. ఉత్తర్వులు జారీ

అభ్యంతరాలు స్వీకరించనున్న

కమిషనర్.. నేడో, రేపో నోటిఫికేషన్?

ఎన్నికల టెన్షన్: ఓటమి భయంతో

## సర్పంచ్ అభ్యర్థి ఆత్మహత్య

పంచాయతీ ఎన్నికల వేళ విషాదాలు

ఓటమి భయంతో సంగారెడ్డి జిల్లాలో సర్పంచ్ అభ్యర్థి ఆత్మహత్య

ప్రచారం చేస్తూ గుండెపోటుతో
కుప్పకూలిన మహిళా వార్డు సభ్యురాలు

నిద్రలోనే గుండెపోటుతో మరో వార్డు అభ్యర్థి కన్నుమూత

ఎన్నికల కోడ్ ఉల్లంఘన..
బాండ్ పేపర్‌తో ప్రచారం చేస్తున్న అభ్యర్థిపై కేసు



# ప్రపంచంలో అగ్రగామిగా తెలంగాణ

## పదేళ్లలో తెలంగాణను ప్రపంచస్థాయి రాష్ట్రంగా మారుస్తాం: సీఎం రేవంత్

- జీడీపీలో తెలంగాణ వాటాను 2047 నాటికి 10 శాతానికి పెంచే లక్ష్యం
- చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ మోడళ్లు ప్రేరణ
- 'తెలంగాణ రైజింగ్ -2047' దార్శనిక పథకం ఆవిష్కరణ
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లే ప్రణాళిక
- సేవలు, తయారీ, వ్యవసాయ రంగాలను 3 విభాగాలుగా అభివృద్ధి
- క్యూర్, ప్యూర్, రేర్ మోడళ్లతో ప్రాంతాలవారీగా అభివృద్ధి లక్ష్యాలు
- ప్రభుత్వ-నిపుణుల సూచనలతో భవిష్యత్తు రోడ్‌మ్యాప్ సిద్ధం




హైదరాబాద్: తెలంగాణను రాబోయే పదేళ్లలో దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందినదిగా, ప్రపంచంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రస్తుతం జీడీపీలో 5 శాతంగా ఉన్న రాష్ట్ర వాటాను 2047 నాటికి 10 శాతానికి చేర్చడమే తమ సంకల్పమని చెప్పారు. హైదరాబాద్‌లో జరిగిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ - 2025' ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి కీలక ప్రసంగం చేశారు. అభివృద్ధి విషయంలో చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ వంటి మహా దేశాల పురోగతి

(మిగతా 2వ పేజీలో)

## టెక్నాలజీ శిఖరాగ్రంలో ప్రపంచం కానీ మనసుల్లో మాత్రం దారిద్ర్యం



- ఎన్నడూ లేనంతగా టెక్నాలజీ అభివృద్ధి, కానీ మానవ విలువలలో పడిపోతున్న ప్రపంచం
- తీవ్రవాదం, విభజన, విద్వేష రాజకీయాలు పెరుగుతున్నాయన్న కైలాష్ సత్యార్థి ఆందోళన
- సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనే శాంతి-పరిష్కారాలకు మార్గం
- తెలంగాణ దార్శనిక అభివృద్ధిని నోబెల్ గ్రహీత ప్రశంస

## రాష్ట్ర అభివృద్ధికి విద్యుత్ కీలకం: భట్టి



- పరిశ్రమల నుంచి జీవన ప్రమాణాల వరకు దాని ప్రభావం
- హైదరాబాద్ అతి పెద్ద ఈ-బస్సు వినియోగ నగరం
- మరో 20 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రణాళిక
- 2047 నాటికి 1.39 లక్షల మెగావాట్ల విద్యుత్ అవసరం



## అమెరికా మార్కెట్‌లో భారత్ బియ్యం.. సుంకాలతో చెక్ : ట్రంప్

## 'వందేమాతరం'పై నెహ్రూది విశ్వాస ఘాతం : ప్రధాని మోదీ

- జిన్నా ఒత్తిడికి లొంగి వందేమాతరాన్ని కుదించి ముక్కలు చేశారని మోదీ ఆరోపణ
- ముస్లింలను రెచ్చగొట్టేలా ఉందని ముఖ్య చరణాలు తొలగించారని విమర్శ
- సామాజిక సామరస్యమేనని చెప్పి బుజ్జగింపు రాజకీయాలు నడిపారని ఆరోపణ
- వందేమాతరం గౌరవం తగ్గించడంతో చివరకు దేశం విభజనకు దారితీసిందని వ్యాఖ్య
- గాంధీ కోరినా గీతానికి న్యాయం చేయలేదని మోదీ వ్యథ
- వందేమాతరం స్వాతంత్ర్య పోరాటానికి శక్తినిచ్చిన మహామంత్రమని గుర్తుచేసిన ప్రధాని
- 150 ఏళ్ల వందేమాతరం వైభవాన్ని ప్రజలు తిరిగి తెలుసుకోవాలన్న ఆహ్వానం
- ప్రతిపక్షాల దాడులు, విమర్శల మధ్యలో కూడా మోదీ ధీటుగా సమాధానాలు



## 2026 ఏడాదికి సెలవులు ఖరారు చేసిన తెలంగాణ ప్రభుత్వం

27 సాధారణ సెలవులు, 26 ఐచ్ఛిక సెలవులు


ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి

భోగి మొదలు క్రిస్మస్ మరుసటి రోజు వరకు 27 సాధారణ సెలవులు

# ప్రపంచంలో అగ్రగామిగా తెలంగాణ

తమకు స్ఫూర్తి అని, ఆ దేశాలత్తో పోటీ పడే స్థాయికి తెలంగాణను తీసుకెళ్లాలని భావిస్తున్నామని స్పష్టం చేశారు. "దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక నాయకులు రాజ్యాంగం రూపకల్పన ద్వారా రోడ్‌మ్యాప్ వేశారు. అదే విధంగా, తెలంగాణ భవిష్యత్తు కోసం మేమూ దార్శనిక పథకాన్ని రూపొందించాలని నిర్ణయించుకున్నాం. ప్రజల అభిప్రాయాలు, నిపుణుల సూచనలు, ప్రభుత్వ యంత్రాంగం సహకారంతో 'తెలంగాణ రైజింగ్ %-% 2047'కు బీజం పడింది" అని సీఎం వివరించారు. 2014లో సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ నాయకత్వంలో రాష్ట్ర కల నిజమైందని, ఆ తెలంగాణను ఇప్పుడు మరింత శక్తివంతమైన, సుస్థిర అభివృద్ధి రాష్ట్రంగా తీర్చిదిద్దడం తమ లక్ష్యమని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లకు పెంచే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్ణయించింది. దేశ జనాభాలో రాష్ట్ర జనాభా 2.9 శాతం మాత్రమే అయినా, జీడీపీలో 5 శాతం వాటా తెలంగాణదే అని వివరించారు.

విజన్-2047లో భాగంగా రాష్ట్రాన్ని మూడు ప్రధాన అభివృద్ధి ప్రాంతాలుగా విభజించామని చెప్పారు: క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) - నగర ప్రాంతాల అభివృద్ధి ప్యూర్ (పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ) -నగర పరిసరాల పురోభివృద్ధి రేర్ - (గ్రామీణ%-%వ్యవసాయ రంగాల బలోపేతం. ప్రతి ప్రాంతానికి ప్రత్యేక అభివృద్ధి లక్ష్యాలు, పెట్టుబడి అవకాశాలు, వనరుల వినియోగ విధానాలు నిర్దేశించిన మొదటి రాష్ట్రం తెలంగాణేనని ముఖ్యమంత్రి



గర్వంగా తెలిపారు. సదస్సుకు హాజరైన వ్యాపారవేత్తలు, విధాననిర్ణేతలు, దౌత్యవేత్తలు, నిపుణుల సూచనలు స్వాగతించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. "తెలంగాణలో అపారమైన అవకాశాలు ఉన్నాయి. సానుకూల వాతావరణం ఉంది. ఈ ప్రయాణంలో అందరూ భాగస్వాములు కావాలి" అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# రాష్ట్ర అభివృద్ధికి విద్యుత్ కీలకం: భట్టి

**రైతులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సీఐఐ-టీవీఎస్ ప్రణాళిక**

**ఆరోగ్య రంగంలో అపోలో 1,700 కోట్ల పెట్టుబడి**

**అదానీ గ్రూప్ నుండి భారీ గ్రీన్‌డేటా సెంటర్ ప్రాజెక్టు**

**వరల్డ్ ఎకనమిక్ ఫోరం తెలంగాణతో**


**భాగస్వామ్యాన్ని కొనసాగించనున్నట్టు వెల్లడింపు**



హైదరాబాద్: రాష్ట్రం 2047 నాటికి చేరుకోవాలనుకున్న 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ విజన్‌కు విద్యుత్ రంగమే మౌలిక శక్తి అని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గ్లోబల్ సమ్మిట్-2025లో భాగంగా ఫ్యూచర్ సిటీలో నిర్వహించిన 'ద జస్ట్ ట్రాన్సిషన్ ఇన్‌టు 2047: పవరింగ్ తెలంగాణ ఫ్యూచర్' చర్చాగోష్టిలో ఆయన మాట్లాడారు. పారిశ్రామీకరణ, ఉద్యోగావకాశాలు, వ్యవసాయ రంగ ఉత్తేజం, నగరాల్లో జీవన ప్రమాణాల మెరుగుదల%-% ఇవన్నీ విద్యుత్ వ్యవస్థ పటిష్టతపై ఆధారపడిన అంశాలని భట్టి పేర్కొన్నారు. అందుకే రాష్ట్ర అభివృద్ధి వ్యూహంలో వాతావరణ చర్యలు, ఇంధన మార్పును ప్రధాన స్తంభాలుగా నిలిపామని చెప్పారు. ప్రస్తుత 11.4 గిగావాట్ల విద్యుత్ సామర్థ్యానికి తోడు మరో 20 గిగావాట్ల పునరుత్పాదక విద్యుదుత్పత్తి లక్ష్యంతో ఇప్పటికే రోడ్‌మ్యాప్ సిద్ధమైందని తెలిపారు. 2030 నాటికి హైదరాబాద్‌ను దేశంలోనే అత్యధిక ఈ-బస్సులు నడిచే నగరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. 2047 నాటికి పారిశ్రామికాభివృద్ధి అవసరాలకు అనుగుణంగా రాష్ట్రానికి 1.39 లక్షల మెగావాట్ల కంటే ఎక్కువ విద్యుత్ అవసరం ఉంటుందని అంచనా వేశారు. దీనికి తగినట్టు పునరుత్పాదక ఇంధనాలతో పాటు నిల్వ సౌకర్యాలు, థర్మల్ సామర్థ్యం, డిజిటల్ గ్రిడ్‌లు, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేస్తామని భట్టి తెలిపారు. తెలంగాణ భవిష్యత్ కార్యాచరణలో పట్టణాల్లో పచ్చదనం విస్తరణ, తక్కువ కర్బన ఉద్గారాలతో పరిశ్రమల అభివృద్ధి కూడా ముఖ్య భాగాలేనని వెల్లడించారు. ఈ చర్చాగోష్టిలో ఇదం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కో-ఫౌండర్ అజిత్ పండిట్, ఎన్టీపీసీ గ్రీన్ సీఈఓ సరిత్ మహేశ్వరి, హరీశ్ యార్లగడ్డ, మహ్మద్ సైఫ్, నేత్రా వాల్కవాకర్, ప్రొ. రాజ్‌కిరణ్ తదితరులు ప్యానెల్ స్పీకర్లుగా పాల్గొన్నారు.

# టెక్నాలజీ శిఖరాగ్రంలో ప్రపంచం.. కానీ మనసుల్లో మాత్రం దారిద్ర్యం!

### తీవ్రవాదం, విభజన, విద్వేష రాజకీయాలు పెరుగుతున్నాయన్న కైలాష్ సత్యార్థి ఆందోళన



ప్రపంచం ఎన్నడూ లేనంతగా టెక్నాలజీ, ఐటీ రంగాల పురోగతి సాధించిన ఈ సమయంలోనే మానవత్వం మాత్రం దారుణంగా తగ్గిపోతోందని నోబెల్ పురస్కార గ్రహీత కైలాష్ సత్యార్థి ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యూచర్ సిటీలో జరిగిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025' ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యోపన్యాసం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా తీవ్రవాదం, విభజన, విద్వేష రాజకీయాలు పెరుగుతున్నాయని, మానవ విలువలు కనుమరుగైపోతున్నాయన్న ఆందోళన వ్యక్తం చేశారు. "మానవత్వం ప్రమాదంలో పడింది, శాంతి ప్రమాదంలో పడింది. వినూత్న పరిష్కారాలను వెతకాల్సిన సమయం ఇది" అని అన్నారు. సుస్థిర ఆర్థిక అభివృద్ధి లక్ష్యాల సాధనే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారమని, ఈ దిశగా తెలంగాణ మంచి ముందడుగు వేసిందని ప్రశంసించారు. తన ప్రసంగంలో సత్యార్థి, "రెండు సంవత్సరాల్లో 20 లక్షలమందికి పైగా రైతుల రుణ మాఫీ, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, విద్య%-%వైద్య రంగాల ప్రక్షాళన%ొ% ఇవన్నీ ఎలా సాధ్యమయ్యాయి?" అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదగడం అసాధ్యం కాదని తెలిపారు. "దేశంలో 100 కోట్ల సమస్యలుంటే, వాటికి 130 కోట్ల మంది ప్రజలే పరిష్కారం" అని వ్యాఖ్యానించారు.

**రైతులను పారిశ్రామికవేత్తలుగా చేస్తాం: టీవీఎస్ చైర్మన్ దినేశ్**

సీఐఐ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 5,000-10,000 మంది రైతులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని టీవీఎస్ సప్లై చైన్ సొల్యూషన్స్ చైర్మన్ ఆర్. దినేశ్ తెలిపారు. తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో టీవీఎస్ గ్రూప్ భాగస్వామ్యం అవుతుందని చెప్పారు.

**1,700 కోట్ల పెట్టుబడులు : అపోలో శోభన కామినేని**

వచ్చే మూడు సంవత్సరాల్లో ప్రోటాన్ ఆధారిత ఇన్నోవేషన్ కేంద్రం సహా పలు ఆరోగ్య సేవల కోసం 1,700 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్టు అపోలో ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ శోభన కామినేని తెలిపారు. 'జెమినాయ్' అనే కొత్త ఏఐ వైద్యసేవను కూడా పరిచయం చేశారు.

**2,500 కోట్ల గ్రీన్‌డేటా సెంటర్: కరణ్ అదానీ**

రాష్ట్రంలో 48 మెగావాట్ సామర్థ్యంతో గ్రీన్‌డేటా సెంటర్ నిర్మించేందుకు 2,500 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీ ప్రకటించారు. అత్యాధునిక ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలతో ఈ కేంద్రం పనిచేయనుందని తెలిపారు.

**"తెలంగాణతో భాగస్వామ్యం కొనసాగుతుంది": వరల్డ్ ఎకనమిక్ ఫోరం**

వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఫ్రాంటియర్ టెక్నాలజీస్ మరియు సైబర్ సెక్యూరిటీ విభాగాల అధిపతి జెరెమీ జుర్గెన్స్ మాట్లాడుతూ తెలంగాణ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని, తమ భాగస్వామ్యం భవిష్యత్తులో మరింత బలపడుతుందని అన్నారు. దావోస్, బయోఏసియా సదస్సుల్లో సీఎం రేవంత్‌ను కలుసుకోవాలని ఎదురుచూస్తున్నామన్నారు.

**చిన్న అడుగులే పెద్ద విజయాలకు మార్గం౹ అభిజీత్ బెనర్జీ**

నోబెల్ గ్రహీత, ఆర్థికవేత్త అభిజీత్ బెనర్జీ మాట్లాడుతూ "ప్రతి ఒక్కరినీ అభివృద్ధిలో భాగస్వాములుగా చేయడమే కీలకం. చిన్న చిన్న సరికొత్త అడుగులే భారీ లక్ష్యాలను సాధించే బాట చూపుతాయి" అని అన్నారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యం సాధ్యం కావడానికి చేయాల్సింది ముందుగా స్పష్టమైన ఆలోచన, సరైన దిశ నిర్ణయం అని చెప్పారు.

# 'వందేమాతరం'పై నెహ్రూది విశ్వాస ఘాతం : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: లోక్‌సభలో వందేమాతరం 150వ వార్షికోత్సవంపై జరిగిన ప్రత్యేక చర్చను ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ, ఈ పవిత్ర గీతానికి కాంగ్రెస్ పార్టీ పెద్ద అన్యాయం చేసిందని తీవ్రంగా మండిపడ్డారు. జవహర్‌లాల్ నెహ్రూ, మహమ్మద్ అలీ జిన్నా ఒత్తిడికి లొంగిపోయి వందేమాతరంలోని కీలక చరణాలు తొలగించారని మోదీ ఆరోపించారు. ముస్లింలను రెచ్చగొడుతుందన్న పేరుతో గీతాన్ని కుదించడమే అసలైన బుజ్జగింపు రాజకీయమని విమర్శించారు. నెహ్రూ నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు రాసిన లేఖలో కూడా ఇదే వ్యాఖ్యలున్నాయని మోదీ గుర్తుచేశారు. 1937లో కోల్‌కతాలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ వందేమాతరం గొప్పదనమేంటని సమీక్షకు పెట్టడం దేశాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేసిందని అన్నారు. అప్పుడు కాంగ్రెస్ పట్ల దేశ వ్యాప్తంగా నిరసనలు జరిగాయని చెప్పారు. "బంకించంద్ర చటర్జీ 1875లో రాసిన వందేమాతరం స్వాతంత్ర్య సమరయోధులకు శక్తినిచ్చింది. బ్రిటిష్ పాలకులు ఎన్నో కుట్రలు చేసినా ఈ గీతం శిలలా నిలిచింది. 1905లో బెంగాల్ విభజనకు కూడా కారణం ఇదే శక్తి" అని మోదీ వివరించారు. మహాత్మా గాంధీ సైతం వందేమాతరాన్ని మరింత గౌరవ స్థాయికి చేర్చాలని కోరినా, కాంగ్రెస్ నేతలు దానికి అనుకూలంగా వ్యవహరించలేదని విమర్శించారు. దేశానికి సవాళ్లు ఎదురైనప్పుడల్లా వందేమాతరం ఇచ్చిన స్ఫూర్తితో భారతం ఎదిగిందని మోదీ పేర్కొన్నారు. "యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలు, కోవిడ్%-19 ప్రతీసారి ఈ గీతమే మనకు బలం. 2047 వికసిత్ భారత్ లక్ష్యానికి వందేమాతరం మన మంత్రం" అని చెప్పారు. తృణమూల్ ఎంపీలు ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయగా మోదీ స్పందిస్తూ, "కాంగ్రెస్ విధానాలను ఔట్‌సోర్సింగ్‌గా తీసుకున్నట్లున్నారు" అని చురకలు అంటించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా వందేమాతరం భారతీయ విలువల ప్రతీక అని చెప్పారు. అయితే ప్రతిపక్షాలు బీజేపీపై తీవ్రమైన విమర్శలు గుప్పించాయి. అఖిలేశ్ యాదవ్ బీజేపీకి వందేమాతరం అర్థమే తెలియదని, డీఎంకే ఎంపీ ఎ.రాజా గీతాన్ని హిందువులకే పరిమితం చేసిందనే వాదననే వివాదానికి మూలమన్నారు. తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రా బెంగాల్ ఎన్నికల కోసం వందేమాతరం ఉద్యమంగా ఉపయోగిస్తున్నారని ఆరోపించారు.

## డీజీసీఏ నోటీసులపై ఇండిగో స్పందన

**ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు**

**విమానాల రద్దుకు ప్రాథమికంగా ఐదు కారణాలు వెల్లడి**

**పూర్తిస్థాయి విశ్లేషణకు మరింత సమయం కావాలని వినతి**

విమాన సర్వీసుల అంతరాయంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) జారీ చేసిన షోకాజ్ నోటీసుకు ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో స్పందించింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నట్లు తెలిపింది. ఈ గందరగోళానికి దారితీసిన పూర్తి స్థాయి కారణాలను విశ్లేషించేందుకు తమకు మరింత సమయం కావాలని కోరింది. ఈ మేరకు సంస్థ సీఈవో, సీఓఓల సంతకాలతో కూడిన వివరణను డీజీసీఏకు సమర్పించింది. డిసెంబర్ ఆరంభంలో తమ విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం కలగడానికి ప్రాథమికంగా ఐదు అంశాలు కారణమని ఇండిగో తన నివేదికలో పేర్కొంది. స్వల్ప సాంకేతిక సమస్యలు, విమానాల షెడ్యూళ్లలో మార్పులు, ప్రతికూల వాతావరణం, విమానయాన వ్యవస్థలో పెరిగిన రద్దీ వంటివి తమ నెట్‌వర్క్‌పై ప్రభావం చూపాయని వివరించింది. వీటికి తోడు కొత్తగా అమల్లోకి వచ్చిన 'ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ (ఎఫ్‌డీటీఎల్) ఫేజ్ II' నిబంధనలు కూడా ఇబ్బందులకు ఒక కారణమని తెలిపింది. ఈ కారణాలన్నీ కలిసి తమ ఆన్-టైమ్ పనితీరును దెబ్బతీశాయని ఇండిగో పేర్కొంది. దీంతో నెట్‌వర్క్‌ను పునరుద్ధరించి, ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు 'నెట్‌వర్క్ రీబూట్' లాంటి కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని, ఫలితంగా పెద్ద సంఖ్యలో విమానాలను రద్దు చేయాల్సి వచ్చిందని వివరించింది. ప్రస్తుతం పరిస్థితి సంక్లిష్టంగా ఉన్నందున, పూర్తి స్థాయి 'రూట్ కాజ్ అనాలిసిస్' (ఆర్‌సీఏ)చేయడానికి డీజీసీఏ నిబంధనల ప్రకారం 15 రోజుల గడువు ఇవ్వాలని కోరింది. విచారణ పూర్తయిన వెంటనే సమగ్ర నివేదిక సమర్పిస్తామని హామీ ఇచ్చింది.

## 2026 ఏడాదికి సెలవులు ఖరారు చేసిన తెలంగాణ ప్రభుత్వం

**27 సాధారణ సెలవులు, 26 ఐచ్ఛిక సెలవులు తెలంగాణ**

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి**

**భోగి మొదలు క్రిస్‌మస్ మరుసటి రోజు వరకు 27 సాధారణ సెలవులు**

2026 సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాధారణ మరియు ఐచ్ఛిక సెలవుల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో మొత్తంగా 27 సాధారణ సెలవులు, 26 ఐచ్ఛిక సెలవులు ఉన్నాయని ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన సాధారణ సెలవుల్లో భోగి, సంక్రాంతి, గణతంత్ర్య దినోత్సవం, మహాశివరాత్రి, హోలి, ఉగాది, రంజాన్, శ్రీరామనవమి, గుడ్ ఫ్రైడే, బాబు జగ్జీవన్ రామ్ జయంతి, డాక్టర్ అంబేద్కర్ జయంతి, బక్రీద్, మొహర్రం, బోనాలు, స్వాతంత్ర్య దినోత్సవం, ఈద్ మిలాద్ ఉన్ నబీ, శ్రీ కృష్ణాష్టమి, వినాయక చవితి, మహాత్మా గాంధీ జయంతి, సద్దుల బతుకమ్మ, విజయ దశమి, దీపావళి, కార్తీక పౌర్ణమి, క్రిస్‌మస్ ఉన్నాయి. రంజాన్, విజయదశమి, క్రిస్‌మస్ పండుగల మరుసటి రోజు కూడా సాధారణ సెలవుగా ప్రకటించింది.

### ఎన్నికల టెన్షన్: ఓటమి భయంతో సర్పంచ్ అభ్యర్థి ఆత్మహత్య

సంగారెడ్డి : తెలంగాణలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల ప్రక్రియ తీవ్ర ఒత్తిడితో కూడిన వాతావరణంలో సాగుతోంది. ఈ క్రమంలో పలుచోట్ల విషాదకర సంఘటనలు చోటుచేసుకున్నాయి. సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో ముగ్గురు అభ్యర్థులు మృతి చెందగా, సిద్దిపేట జిల్లాలో ఓ అభ్యర్థిపై కేసు నమోదైంది. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం పిప్పడ్‌పల్లి గ్రామ సర్పంచ్‌గా కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేస్తున్న సీహెచ్ రాజు (36) ఆత్మహత్య చేసుకున్నారు. ఎన్నికల్లో ఓడిపోతాననే ఆందోళనతో, నమ్మినవాళ్లే ప్రచారానికి రావడం లేదన్న మనోవేదనతో ఆయన చెట్టుకు ఉరేసుకుని ప్రాణాలు విడిచారు. ఆదివారం రాత్రి తోటి అయ్యప్ప స్వాములతో తన ఆవేదన పంచుకోగా, వారు ధైర్యం చెప్పినప్పటికీ సోమవారం ఉదయం ఆయన విగతజీవిగా కనిపించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మంచర్లగూడలో 8వ వార్డుకు పోటీ చేస్తున్న పల్లె లత (42) ప్రచారం నిర్వహిస్తుండగా గుండె నొప్పితో కుప్పకూలిపోయారు. మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే కన్నుమూశారు. అలాగే, సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం చక్రియాల గ్రామంలో 8వ వార్డు అభ్యర్థి కొత్తొల్ల పద్మారావు (50) ఆదివారం రాత్రి ప్రచారం ముగించుకుని ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి నిద్రలోనే గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మరణంతో ఆ వార్డులో పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య రెండుకు చేరిందని, ఎన్నికలకు ఎలాంటి ఆటంకం లేదని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వంగపల్లిలో సర్పంచ్ అభ్యర్థి చల్ల కమలాకర్ రెడ్డి బాండ్ పేపర్‌పై హామీలు ఇస్తూ ప్రచారం చేస్తున్నారని, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినందుకు ఆయనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

### అమెరికా మార్కెట్‌లో భారత్ బియ్యం.. సుంకాలతో చెక్ : ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వాణిజ్య యుద్ధానికి సంకేతాలు పంపారు. భారత్ నుంచి దిగుమతి అవుతున్న బియ్యం, కెనడా నుంచి వస్తున్న ఎరువులపై కొత్తగా సుంకాలు విధించే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు. వైట్‌హౌస్‌లో అమెరికా రైతులకు 12 బిలియన్ డాలర్ల భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్, కెనడాలతో వాణిజ్య చర్చల్లో ఆశించిన పురోగతి లేకపోవడంతో ట్రంప్ ఈ నిర్ణయం వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా భారత్ బియ్యం దిగుమతుల వల్ల అమెరికాలోని స్థానిక రైతులు నష్టపోతున్నారని ఆయన ఆరోపించారు. సమావేశంలో ఒక రైతు మాట్లాడుతూ.. అమెరికా రిటైల్ మార్కెట్లో రెండు అతిపెద్ద రైస్ బ్రాండ్లు భారత్ కంపెనీలవేనని చెప్పగా, ట్రంప్ వెంటనే స్పందించారు.

### హైదరాబాద్‌కు సరికొత్త పర్యాటక కళ.. రానున్న కృత్రిమ బీచ్, టన్నెల్ అక్వేరియం

**కొత్వాల్‌గూడ వద్ద కృత్రిమ బీచ్ ఏర్పాటు**

హైదరాబాద్ : హైదరాబాద్ నగర పర్యాటకానికి సరికొత్త కళ రానుంది. నగరవాసులకు సముద్ర తీర అనుభూతిని అందించేందుకు కృత్రిమ బీచ్‌తో పాటు, దుబాయ్, సింగపూర్ తరహాలో టన్నెల్ అక్వేరియం, ఫ్లయింగ్ థియేటర్ వంటి భారీ ప్రాజెక్టులు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం పలు సంస్థలు నేడు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ) కుదుర్చుకోనున్నాయి. ప్రాజెక్టు భాగస్వామి హరి దామెర వెల్లడించిన వివరాల ప్రకారం కొత్వాల్‌గూడలో 35 ఎకరాల విస్తీర్ణంలో రూ.235 కోట్ల వ్యయంతో ఈ కృత్రిమ బీచ్‌ను ఏర్పాటు చేయనున్నారు. స్పెయిన్ సాంకేతిక సహకారంతో నిర్మించే ఈ బీచ్‌లో సాధారణ ప్రజలు సేద తీరడంతో పాటు బోటింగ్ వంటివి కూడా ఆస్వాదించవచ్చు. డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు కూడా ఇది కేంద్రంగా నిలుస్తుంది. ప్రవేశ రుసుము సుమారు రూ.200 వరకు ఉండవచ్చని ఆయన తెలిపారు. ఇక దుబాయ్, సింగపూర్‌లలో ఉన్న తరహాలోనే నీటి అడుగున నడుస్తూ జలచరాలను వీక్షించే అనుభూతినిచ్చేలా టన్నెల్ అక్వేరియం రానుంది. కెడార్ అనే సంస్థ రూ.300 కోట్లతో దీనిని నిర్మించనుంది. దీంతో పాటు, ఫ్యూచర్ సిటీలో వంద ఎకరాల్లో వెయ్యి కోట్ల పెట్టుబడితో అంతర్జాతీయ సాంస్కృతిక కేంద్రం కూడా ఏర్పాటు కానుంది. వీటితో పాటు హైదరాబాద్ సమీపంలోని వికారాబాద్‌లో పర్యాటకుల కోసం ప్రత్యేకంగా క్యారవాన్ పార్కును ఏర్పాటు చేయనున్నారు.

# నిద్రమత్తులో

## గాజులరామారంలో నో టౌన్ ప్లానింగ్

## ఇష్టానురీతిలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు

# గాజులరామారం టౌన్ ప్లానింగ్



సీజ్ అయిన భవన నిర్మాణాన్ని పూర్తి చేసిన బిల్డర్ సురేంద్ర

హెచ్.ఏ.ఎల్. కాలనీ,
పారడైస్ ఫంక్షన్ హాల్ ముందు కామర్శియల్ శెట్టర్ లతో అక్రమ నిర్మాణం





కైలాష్ హిల్స్ లో వెలిసిన అక్రమ షెడ్డు నిర్మాణానికి ఇంటి నంబర్ సైతం ఇచ్చిన మున్సిపల్ అధికారులు


హెచ్. ఏ. ఎల్. కాలనీలో వెలుస్తున్న కమర్శియల్ భవన నిర్మాణం



**కుత్బుల్లాపూర్, నవతరం:** జీహెచ్ఎంసీ కూకట్పల్లి జోన్ గాజులరామారం సర్కిల్ లో అసలు టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నారా? అనే అనుమానం కలుగకమానదు. గల్లీకో అనుమతుల్లేని భవనం, కమర్శియల్ షెడ్డు వెలుస్తుంటే కేవలం నోటీసులతో కాలం వెళ్ళదీస్తున్నారంటే అతిషయోక్తి కాదు. పూర్తి సర్కిల్ లో తాజాగా వెలుస్తున్న ఏ ఒక్క నిర్మాణం కూడా టీజీ బీ పాస్ చట్టానికి లోబడి నిర్మించడం లేదంటే వీళ్ళ పనితీరు మనకు అర్థమవుతుంది. ప్రధానంగా గాజులరామారం, జగద్గిరిగుట్ట వార్డు లలో తమ ఇష్టానుసారంగా బహుళ అంతస్థుల భవన నిర్మాణాలు కొనసాగుతున్నా ఇక్కడి టౌన్ ప్లానింగ్, నోడల్ అధికారికి మాత్రం చీమకుట్టినట్టు కూడా లేదు. అందుకు ప్రధాన కారణం 'అక్రమ నిర్మాణదారులు వేస్తున్న ఎత్తుగడలే, ఒక్కో ఫ్లోర్ కు ఇంత అంటూ వసూళ్లకు తెగబడుతున్న లంచగొండి అధికారులను అడిగేవారు లేకపోవడం' అంటూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఇక్కడి ప్రజలు. ఒక్కో అక్రమ నిర్మాణం పై కొన్ని పదుల సంఖ్యలో ఫిర్యాదులు వచ్చినా%ౌ% మన్ను తిన్న పాముల మాదిరిగా%ౌ% కేవలం నోటీసులు జారీ చేస్తున్నాం అంటూ కాలాయాపన చేస్తున్న ఇక్కడి టౌన్ ప్లానింగ్ అధికారులకు, నోడల్ అధికారికి ఏ గడ్డి పెట్టినా బుద్ది రాదు అంటున్నారు విషయం తెలిసినవారు. అక్రమ నిర్మాణాలను నియంత్రించాల్సిన అధికారులే అమ్ముడు పోతుంటే%ౌ% ప్రజావాణిలో సైతం ఫిర్యాదులు చేసినా, చర్యలు శూన్యంగా ఉంటే ఇంకెందుకు ఈ టౌన్ ప్లానింగ్ అధికారులు, వ్యవస్థ%ౌ%? గాజులరామారం రాంకీ వన్ మార్వెల్ ముందు వెలిసిన సెల్లార్ భవన నిర్మాణాలు ఇప్పటికే పూర్తి అయిపోయాయి. ఈ నిర్మాణాలు ప్రారంభదశలో ఉన్నప్పటి నుండి స్థానికులు ఫిర్యాదులు చేసినా ఒక్క భవన నిర్మాణం పై కూడా చర్యలు తీసుకోలేకపోయారు ఈ లంచగొండి అధికారులు. రఫీ నిర్మించిన సెల్లార్ ప్లస్ నాలుగు అంతస్థుల భవనానికి దగ్గరుండి మరీ మద్దతు తెలిపారు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అంటూ మాట్లాడుకుంటున్నారు ఇక్కడి జనం. ద్వారక నగర్ పక్కనే ఉన్న శ్రీరాం నగర్ లో సురేంద్ర అనే నిర్మాణదారుడు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిర్మించిన బహుళ అంతస్థుల భవన నిర్మాణాన్ని తాత్కాలికంగా సీజ్ చేసినా%ౌ% సదరు బిల్డర్ మాత్రం తన పవర్ ఏంటో చూపించుకుని మరీ భవన నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నాడు. కేఎల్ బార్ అండ్ రెస్టారెంట్ ముందు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వెలిసిన భారీ షెడ్డు ను ఇలాగే సీజ్ చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు అందినకాడికి దండుకుని దానినీ వదిలేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే కొన్ని వందల అక్రమ నిర్మాణాలు కేవలం ఈ రెండు వార్డులలో ఉన్నాయంటే వీరి పనితీరు ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుంది. ద్వారకా నగర్ కమాన్ లోపల వెలిసిన కమర్శియల్ శెట్టర్లపై పదుల సంఖ్యలో ఫిర్యాదులు స్థానికులు తమ ట్విట్టర్ (ఎక్స్) అకౌంట్, %ఎఎ స్త్రష్ట్రఎష% యాప్ లలో ఆన్లైన్ ఫిర్యాదులు చేసినా ఇప్పటికీ చర్యలు శూన్యంగానే మిగిలాయి. కైసర్ నగర్లో ఇండ్ల మధ్యన వెలిసిన కమర్శియల్ షెడ్డు నిర్మాణం పై చేసిన స్థానికుల ఫిర్యాదులకు స్పందించని టౌన్ ప్లానింగ్ అధికారులు%ౌ% కూల్చివేయాల్సింది పోయి నోటీసులతో కాలాయాపన చేస్తున్నారు. "గల్లీకో నిర్మాణం%ౌ% ఫ్లోర్ కింత అంటూ వసూళ్లు%ౌ% చర్యలు మాత్రం శూన్యం" అక్రమ నిర్మాణలపై ఉక్కుపాదం మోపాలంటూ ఎప్పటికప్పుడు తెలంగాణ రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం సూచిస్తున్నా, ఇక్కడి అధికారులు మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అక్రమ నిర్మాణాలను నియంత్రించడానికి ఏర్పాటు చేసిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ %ఒ% డిమాలిషన్ స్క్వాడ్ ఎటు పోయిందో ఎవరికీ అర్థం కావడం లేదు. ఇప్పటికైనా కూకట్పల్లి జోనల్ కమిషనర్ కల్పించుకుని, గాజులరామారం సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులపై నిఘా పెంచి, నోడల్ అధికారిపై విజిలెన్స్ ఎంక్వయిరీ వేసి.. అసలు నిజాలు బయటకు తీయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే సున్నం కొట్టిన రాయిలా ఎలాంటి స్పందన లేకుండా ఇలాగే తమ విధులను నిర్వహిస్తారు సో కాల్డ్ అధికారులు




గాజులరామారం వార్డు, రాంకీ మార్వెల్ ముందు రెండు ఫ్లోర్ల అనుమతి పొంది పూర్తి కమర్శియల్ తో నిర్మాణం పూర్తి చేసుకున్న నాలుగు ఫ్లోర్ ల సెల్లార్ భవనం






కైసర్ నగర్లో నివాసాల మధ్య వెలిసిన షెడ్డు నిర్మాణానికి కేవలం నోటీసులతో మమః అనిపించిన టౌన్ ప్లానింగ్ అధికారులు



# కుత్బుల్లాపూర్ పర్యటనలో కవిత గరం.. గరం

## ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ప్రాతినిథ్యం వహిస్తున్న కుత్బుల్లాపూర్ లో 100 పడకల ఆసుపత్రి కూడా నిర్మించాలేరా?

## కుత్బుల్లాపూర్ లో 'జనం బాట'లో కల్వకుంట్ల కవిత ఫైర్..



కుత్బుల్లాపూర్ / హైదరాబాద్: కుత్బుల్లాపూర్ ను కాస్త కబ్జాలాపూర్ గా పేరు మారిస్తే బాగుటుందేమోనని ఇక్కడి కబ్జాలు చూస్తే అర్థం అవుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జనం బాటలో భాగంగా శుక్రవారం శాపూర్ నగర్ లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ఆసుపత్రి సిబ్బంది, రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గాజులరామారంలో గల పరికి చెరువును, సూరారం లోని లింగం చెరువును పరిశీలించి చెరువు అక్రమణలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మల్లంపేటలో జాగృతి లోకి నూతనంగా చేరిన వారికి ఆమె కండువా కప్పి జాగృతి లోకి ఆహ్వానించారు. చర్చి గాగిల్లాపూర్ లో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను జాగృతి నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ %ఠ% 60 ఎకరాల్లో విస్తరించి ఉండాల్సిన పరికి చెరువు సగానికి పైగా కబ్జా కావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. 62 ఎకరాలు ఉంటే ఇప్పుడు మాత్రం 16 ఎకరాలకు కుదించుకుపోయిందని చుట్టు పక్కల వాళ్లు చెరువు పరిరక్షణ కోసం ఎన్నో కేసులు పెట్టారని తెలిసిందని అగ్రహం వ్యక్తం చేసింది. పొలిటికల్ మేనేజ్ మెంట్ చేస్తూ చెరువు తినేశారని ఈ కబ్జా ల తతంగం లో అన్ని పార్టీల వాళ్లు ఉన్నారన్నారంది.ఇప్పటికీ కూడా ఇక్కడ నిర్మాణంలో ఉన్న ఇళ్ల పహానీలు చూస్తే ఎఫ్టీఎల్ లో ఉన్నట్లు చూపిస్తున్నాయని, ఎఫ్టీఎల్ లో ఉన్నప్పటికీ నిర్మాణాలకు ఎలా అనుమతిస్తున్నారని ఇది గతపాలకుల, అధికారుల అలసత్వం అని ఏద్దేవా చేసింది.? ఎఫ్టీఎల్ అని రాసి ఉన్న రాళ్లను కూడా రియల్ ఎస్టేట్ మాఫియా భయం లేకుండా తీసేసిందని,హైడ్రా కమిషనర్ కచ్చితంగా దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడి ఎమ్మెల్యే గతంలో టీడీపీ లో ఉండి బీఆర్ఎస్ లోకి వచ్చారు. రేపు ఎక్కడ ఉంటారో తెలియదన్నారు. ఆయన అండదండలతోనే చెరువుల కబ్జాలు జరిగయన్నారు. పేదవాళ్ల ఇళ్లే కాదు, పెద్ద వాళ్ల ఇళ్లను కూడా కూల్చేస్తామని మెసేజ్ ఇవ్వాలన్నారు. గత ఎన్నికల్లో జగద్గిరిగుట్ట బస్సు డిపో ను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చిన ప్రజాప్రతినిధులకు ఇప్పటి వరకు ఏర్పాటు చేసే సోయిలేదా అని ఆగ్రహం వ్యక్తం చేసింది. మెడికల్ కాలేజీ మంజూరైన దానిని ఏర్పాటు చేసే దమ్ము కూడా ఇక్కడి నాయకులకు లేదా అని ప్రశ్నించారు. కుత్బుల్లాపూర్ లో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ లను ప్రభుత్వం వెంటనే పూర్తి చేసి పేదలకు అందజేయాలని డిమాండ్ చేసింది. ప్రజల పక్షానే జాగృతి పోరాటం చేస్తుందని%ఠ% పేదలకు న్యాయం చేయకుండా మోసం చేస్తే తాట తీస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాగృతి బీసీ రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, రాష్ట్ర నాయకులు ఇస్మాయిల్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రాగిడి వెంకటరామిరెడ్డి, అధికార ప్రతినిధి పడాల మనోజ్, శీలం వీరేందర్, సీతారాం, సంధ్యారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. నేటి కార్యక్రమాన్ని దగ్గరుండి నడిపించిన తెలంగాణ జాగృతి బీసీ నాయకులు ఎత్తరి మారయ్యకు స్థానిక ప్రజలు అభినందనలు తెలిపారు.

# బిఆర్ఎస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి

**మళ్లీ కెసిఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయం**

**స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి**

**నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశా**

**మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్చార్జ్ " వనమా"**





కొత్తగూడెం, డిసెంబర్ 08, నవతరం : బిఆర్ఎస్ పార్టీ హయాంలోనే గ్రామీణ ప్రాంతాలు ఎంతగానో అభివృద్ధి చెందాయని స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్చార్జి వనమా వెంకటేశ్వర పిలుపునిచ్చారు. సోమవారం చంటిపల్లి మండల పరిధిలోని నంద తండా అభ్యర్థి మాలోత్ బలరాం నాయక్ , చించుపల్లి తండా మాలోతు రాజా గ్రామపంచాయతీలో పోటీ చేస్తున్న అభ్యర్థుల విజయం కోసం ఆయన విస్తృతంగా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి వనమా, వనమా రాఘవేంద్రరావు లకు ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. డప్పు మేళాలతో, డాన్సులు వేస్తూ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామాల పొలిమేరల నుంచి మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావును, పార్టీ నాయకులను మేళ్ల తాళాలతో స్వాగతం పలుకుతూ గ్రామాల్లో మీది వీధిన ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ హయాంలోనే గ్రామీణ ప్రాంతాలు ఎంతగానో అభివృద్ధి చెందాయన్నారు. రాబోయే ఎన్నికల్లో కల్వకుంట్ల చంద్రశేఖర రావును తిరిగి ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆశీర్వాదాలు తోనే తాను గ్రామపంచాయతీ సర్పంచ్ నుంచి మున్సిపల్ చైర్మన్ గా, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచానని అలాగే రాష్ట్ర మంత్రిగా పనిచేశానని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కొత్తగూడెం నియోజకవర్గంలో తన హయాంలో ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. పట్టణంలోని ఏ బస్తీని, పల్లెల్లో ఏ వీధిని అడిగిన అభివృద్ధి విషయంలో తన పేరే చెబుతాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి బిఆర్ఎస్ పార్టీ గెలుపుతోనే సాధ్యపడుతుందని పేర్కొన్నారు. ఈ పార్టీ నుంచి ఎన్నికల బరిలో దిగిన సర్పంచ్, వార్డ్ మెంబర్ల అభ్యర్థులు నిస్వార్థంగా పనిచేసేందుకు ముందుకు వచ్చారని, అలాంటి వారిని ఎన్నికల బరిలో నిలిపామని పేర్కొన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి వనమా జీబ్ లో నిలుచుని ప్రజలకు అభివాదం చేస్తూ బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వనమా రాఘవేంద్రరావు ప్రజలతో కలిసి డప్పు మేళాలతో నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, నాయకులు బట్టు మంజుల, నవతన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావసరాలు పట్టకుండా కబ్జాలు

## ప్రభుత్వ భూమని కొల్లగొడుతున్నారు

## హైడ్రా ప్రజావాణికి 41 ఫిర్యాదులు





హైదరాబాద్, నవతరం: తప్పుడు సర్వేనంబర్లతో కబ్జాలు చేస్తున్నారు. తప్పుడు పత్రాలు సృష్టిస్తున్నారు. ఖాళీ భూమి కనిపిస్తే చాలు కబ్జాదారులు వాలిపోతున్నారు. పాత్రదారులుగా సామాన్యులను ప్రవేశ పెట్టి .. సూత్రదారులుగా రూ. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కొల్లగొట్టేస్తున్నారు. ఒక ఎకరం కబ్జా చేస్తే రూ. వంద కోట్లకు పైమాటే. ఇలాంటి తరుణంలో రూ. పదుల కోట్లు వెచ్చించి ఆ స్థలాలను సొంతం చేసుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు... అని హైడ్రా ప్రజావాణి ఫిర్యాదుల్లో పలువురు పేర్కొన్నారు. దేశ విభజన సమయంలో వెళ్లిపోయిన వారి భూములు ఎక్కడ ఉన్నయో తెలుసుకుని కబ్జాలకు పాల్పడుతున్నారు. రెవెన్యూ సరిహద్దుల్లో సర్వే నంబర్ల ఓవర్ల్యాపింగ్ను, అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూములు ఇలా దేనినీ వదలకుండా.. కొన్నాళ్లపాటు సామాన్యులతో గుడిసెలు వేయించి.. తర్వాత బడాబాబులు రంగంలోకి దిగి కాజేస్తున్నారంటూ హైడ్రా ప్రజావాణిలో పలువురు ఫిర్యాదు చేస్తున్నారు. ఉప్పల్లో మూడున్నర ఎకరాల భూమి ఇలా కబ్జాకు గురైందని పేర్కొన్నారు. జీడిమెట్ల ఫాక్స్ సాగర్ నుంచి వెన్నెల చెరువుకు వెళ్లే 12 మీటర్ల వరద కాలువను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదు చేశారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి 41 ఫిర్యాదులందాయి. ఈ ఫిర్యాదులను హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య పరిశీలించి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ ఖల్సాలోని సర్వే నంబరు 644, 645 లో 6 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. ఇందులో రెండున్నర ఎకరాల భూమి మెట్రోకు కేటాయించారు. మిగిలిన భూమిలో ఎకరన్నర వరకూ స్థానిక వ్యక్తులు ఆక్రమించి వాహన పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తున్నారు. ఈ పార్కింగ్ దందాను అడ్డుకుని.. మిగిలి ఉన్న ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ కళాశాలను ఏర్పాటు చేయాలని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 645లో జీహెచ్ఎంసీ అనుమతితో 3 సెల్లార్లతో7 అంతస్తుల భవనం కూడా నిర్మాణం అవుతోందని.. ఇదంతా చట్టవిరుద్ధమని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని కోరారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం, మణికొండ పరిధిలోని ముష్కిన్ చెరువుకు వెంటనే ఎఫ్టీఎల్ నిర్ధారించాలని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో విజ్ఞప్తి చేశారు. ఎఫ్టీఎల్ నిర్ధారణ కాకపోవడంతో పై భాగంలో ఎవరికి వారు కబ్జాలకు పాల్పడి నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. సర్వే నంబర్లు 255, 256, 257 పరిధిలో ఉన్న ఈ చెరువు పర్యావరణ పరిరక్షణకు కీలకమైనదని, కానీ ఇటీవల చెరువు నేలను లెవెలింగ్ చేయడం, నిర్మాణాలు చేపట్టడం వంటి చర్యలు తీవ్రంగా పెరిగిపోయాయని వారు తెలిపారు. చెరువు విస్తీర్ణం తగ్గడం, వర్షాకాలంలో వరదలు వచ్చే అవకాశం పెరగడం, జీవవైవిధ్యం దెబ్బతినడం, నీటి నాణ్యత పడిపోవడం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని నివాసులు వాపోయారు. సికింద్రాబాద్ కాంటోన్మెంట్ ఏరియాలోని చిన్న కమల ప్రాంతంలో నాలా ఆక్రమణలు జరుగుతున్నాయని హనుమాన్ టెంపుల్ వెల్ఫేర్ అండ్ యూత్ అసోసియేషన్ సభ్యులు హైడ్రా ప్రజావాణి లో ఫిర్యాదు చేసారు. తిరుమలగిరి వార్డు నెంబర్ 7లో ఉన్న నాలాను కొంతమంది పూర్తి స్థాయిలో ఆక్రమించుకొని తమ ప్రాపర్టీగా చెబుతున్నారని ఆరోపించారు. ప్లాట్ నెంబర్ 1, సర్వే నెంబర్ 17 సమీపంలో ఉన్న ఈ నాలా సాఫీగా సాగేదని ఆక్రమణలతో వరద తమ ప్రాంతాలను ముంచెత్తుతోందని వాపోయారు. నాలామీదే దుకాణాన్ని నడుపుతున్నారని.. గతంలో దీనిని తొలగించగా.. మళ్లీ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దగ్గర్లో ఆలయం ఉండడం వల్ల భక్తులకు కూడా ఇబ్బందిగా పరిణమించిందని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మియాపూర్లోని బీహెచ్ఈఎల్ హెచ్ ఐ జీ ఫేజ్ %-%2, ఉషోదయ ఎన్క్లేవ్ ప్రాంతంలో ఉన్న జీహెచ్ఎంసీ పార్క్ ఆక్రమణకు గురౌతోందని ఎగ్జిక్యూటివ్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సభ్యులు హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు చేశారు. నందనం ట్రీ పార్క్ (పశ్చిమ భాగం) ను గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమించి, పార్క్ సరిహద్దులలో కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టారు. ప్రజల వినియోగం కోసం కేటాయించిన పార్క్ ని చట్టవిరుద్ధంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని వారు పేర్కొన్నారు. హైడ్రా వెంటనే జోక్యం చేసుకుని అక్రమ నిర్మాణాలను ఆపి.. పార్క్ భూమిని రక్షించాలని విజ్ఞప్తి చేశారు.



## రోడ్డు పనులను ప్రారంభించిన

# కార్పొరేటర్ కొలుకుల జగన్


కుత్బుల్లాపూర్, నవతరం: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో కూనమాలక్ష్మి 6 లక్షల రూపాయలతో చేపట్టిన రోడ్డు పనులను సోమవారం డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగద్గిరిగుట్ట డివిజన్ ను అన్ని రంగాలలో అభివృద్ధి పరచడానికి తాను శాయశక్తుల కృషి చేస్తారని హామీ ఇచ్చారు. తాను కార్పొరేటర్గా ఎన్నికైన నాటి నుండి డివిజన్ ను అన్ని రంగాలలో ముఖ్యంగా మౌలిక వసతుల కల్పనలో రాజీ పడకుండా పనులను చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాపయ్య గౌడ్, వెంకటేష్, మహంకాళి, దుర్గయ్య, శ్రీనివాస్, శివ, కేవీ. రాజు, బస్తీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ కుంట కేసు విచారణ ఈ నెల 18కి వాయిదా

**శుక్రవారం హైకోర్టుకు హాజరైన హైడ్రా కమిషనర్**

**ముంపు ప్రాంతానికి వెళ్లడంతో రాలేకపోయానంటూ వివరణ**

హైదరాబాద్, నవతరం: అంబర్పేటలో నయనమనోహరంగా మారిన బతుకమ్మ కుంట కేసు విచారణకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం హైకోర్టుకు హాజరయ్యారు. గత నెల 27న ఇదే కేసు విచారణకు ఎందుకు హాజరు కాలేకపోయోనో హైకోర్టుకు వివరించారు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్. బాచుపల్లి ప్రాంతంలో నివాస ప్రాంతాలు ముంపునకు గురైతే అక్కడకు వెళ్లాల్సి వచ్చిందని.. అందుకే హాజరు కాలేకపోయాననని చెబుతూ కోర్టుకు హైడ్రా కమిషనర్ క్షమాపణ చెప్పారు. హైడ్రా కమిషనర్ వివరణను స్వీకరించినట్టు పేర్కొన్న హైకోర్టు... తదుపరి విచారణకు కమిషనర్ హాజరు కావాల్సినవసరం లేదంటూ మినహాయింపును ఇచ్చింది. కోర్టు ఉత్తర్వుల ప్రకారం చెరువును హైడ్రా తవ్వింది. చుట్టుపక్కల ప్రాంతాలు నీట మునిగే ప్రమాదముండడంతో బండ్ నిర్మించినట్టు వివరణ ఇచ్చారు స్పెషల్ జీపీ స్వరూప్ ఊరెళ్ల. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ఈ నెల 18కి బతుకమ్మకుంట కేసు విచారణను వాయిదా వేసింది తెలంగాణ హైకోర్టు.




# గాజులరామారం డీసీ మల్లారెడ్డిని సస్పెండ్ చేయాలి

**సర్కిల్ కార్యాలయం ముందు**

**ఆకుల సతీష్, జై శంకర్ గౌడ్ టీమ్ నిరసన**




కుత్బుల్లాపూర్, నవతరం: కైసర్ నగర్ - గండి మైసమ్మ రోడ్డుపై ఎమ్మెల్యే అనుచరులు వి లిక్కర్ మార్ట్ కోసం రోడ్ బఫర్ జోన్ను ఆక్రమించి దాదాపు 12 అక్రమ షెడ్లు నిర్మించినప్పటికీ, డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ఆకుల సతీష్, నల్ల జై శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి గేటు కు వినతిపత్రం కట్టి నిరసన తెలియజేశారు. నాయకులు మాట్లాడుతూ... ఆక్సిజన్ హోమ్స్ అపార్ట్మెంట్ వద్ద 60 ఫీట్ రోడ్డు, 30 ఫీట్ ఫుట్పాత్, కైసర్ నగర్ వైపు 60 ఫీట్ బఫర్ జోన్, అపార్ట్మెంట్ సెట్బ్యాక్ (10 మీటర్లు) ఈ మొత్తం స్థలాన్ని అనుమతులు లేకుండా ఆక్రమించి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అనుచరులు భారీ షెడ్లు నిర్మించారని తెలిపారు. వీటిలో ఒకదాంట్లో వి లిక్కర్ మార్ట్ ను అక్రమంగా ఏర్పాటు చేసిన విషయాన్ని అధికారులు కనుగొనకపోయినా కూడా చర్యలు తీసుకోవడంలేదని అన్నారు. ఈ నిర్మాణాల వల్ల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. లిక్కర్ షాపుకు పార్కింగ్ లేకపోవడంతో వాహనాలు రోడ్డుపైనే నిలిపి భారీ ట్రాఫిక్, ప్రమాదాలకు అవకాశం పెరుగుతోందని పేర్కొన్నారు. గాజులరామారం టౌన్ ప్లానింగ్ అవినీతి కి అద్దం పడుతుంది ఈ అక్రమ షెడ్లకు హౌస్ నెంబర్ కేటాయింపు అన్నారు. అధికారుల అవినీతి ఎంత తీవ్రంగా ఉందో చెప్పడానికి ఒక ఉదాహరణ, అనుమతులు లేని అక్రమ షెడ్లకు కూడా ఇంటి నెంబర్ 02-072/350/1/బి కేటాయించడం అన్నారు. ఇది మున్సిపల్ అవినీతి ఏ స్థాయిలో ఉందో స్పష్టంగా చెప్పే సంఘటనగా నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా కూడా ఎమ్మెల్యే అనుచరుల మాటే శాసనమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మొత్తం అవినీతి అధికారుల నియంత్రణలో ఉందని, ఇంకా వారు బిఆర్ఎస్ నాయకుల కోసమే పనిచేస్తున్నారని ఆరోపించారు. ఇదేనా ప్రజల కోసం వచ్చిన ప్రభుత్వం? అని ప్రశ్నించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అక్రమంగా నిర్మించిన 12 భారీ షెడ్లను వెంటనే కూల్చివేయాలి, డీసీ మల్లా రెడ్డి గాజులరామారం సర్కిల్ అండ్ టౌన్ ప్లానింగ్ అధికారులపై కఠిన విచారణ జరపాలి, రోడ్%-%ఫుట్పాత్%-%బఫర్ జోన్ ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి, అక్రమంగా ఏర్పాటు చేసిన వి లిక్కర్ మార్ట్ ను వెంటనే తొలగించాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఇంచార్జి మంత్రి దిద్దిళ్ళ శ్రీధర్ బాబు.. అవినీతి, అధికార దుర్వినియోగం స్పష్టంగా కనబడుతున్నందున, డిప్యూటీ కమిషనర్ గాజులరామారం పై వెంటనే విచారణ ఆదేశించి సస్పెండ్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోతే, రాబోయే రోజుల్లో హైడ్రా కమిషనర్ కార్యాలయంలో పెద్ద ఎత్తున ఫిర్యాదు చేస్తామన్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు వచ్చే వరకు ఈ ఆందోళన ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, కంది శ్రీరాములు, పులి బలరాం, భీమ్ రాజ్, బీజేవైఎం శ్యామ్, దేవర రమేష్, బీజేవైఎం మణికంఠ, అరుణ్ రావు, ఈశ్వర్ రెడ్డి, చందు, లానా, మారి గణేష్, వేముల రమేష్, కీర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణలను తొలగించిన హైడ్రా

## రూ. 600ల కోట్ల విలువైన 5 ఎకరాల భూమికి ఫెన్సింగ్












హైదరాబాద్, నవతరం: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ విలేజ్ మక్తామహబూబ్ పేటలో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా సోమవారం కాపాడింది. 5 ఎకరాల మేర ఉన్న మక్తామహబూబ్ కుంటను కబ్జా చేసేయాలనే ప్రయత్నాలను కూడా అడ్డుకుంది. ఇక్కడ కబ్జాల చెర నుంచి కాపాడిన 5 ఎకరాల ప్రభుత్వ భూమి విలువ రూ. 600ల కోట్లకు పైగా ఉంటుందని అంచనా. మియాపూర్ – బాచుపల్లి ప్రధాన రహదారికి సమాంతరంగా ఉన్న చెరువు కట్టపై 200ల మీటర్ల మేర వేసిన 18 షెట్టర్లను తొలగించింది. దుకాణాల వెనుక వైపు ప్రైవేటు బస్సుల పార్కింగ్ ఉంచిన స్థలాన్నికూడా హైడ్రా ఖాళీ చేయించింది. మియాపూర్ సర్వే నంబర్ 39లో మక్తామహబూబ్‌పేట చెరువు కట్ట కబ్జాతో పాటు.. గతంలో మైనింగ్‌కు ఇచ్చిన సర్వేనంబరు 44/5 లో ఉన్న 5 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురౌతున్నట్టు స్థానికుల నుంచి హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు అందింది. ఒక్కో షెట్టర్(దుకాణం) నుంచి నెలకు రూ. 50 వేల చొప్పున రూ. 9 లక్షల వరకూ వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే అక్కడ ప్రైవేటు బస్సుల పార్కింగ్‌కు స్థలాన్ని ఇచ్చి నెలకు రూ. 8 లక్షల వరకూ వసూలు చేస్తున్నారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదు మేరకు కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో హైడ్రా క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో పరిశీలించింది.

**బడాబాబుల మద్ధతుతో..**

సర్వే నంబరు 44/5 కు బదులు 44/4 నంబరును సృష్టించి 5 ఎకరాల భూమిని కబ్జా చేసినట్టు హైడ్రా విచారణలో తేలింది. కారు వాషింగ్ సెంటర్ ఏర్పాటు చేసుకుని మొత్తం ఈ భూమిని కబ్జా చేసినట్టు వెల్లడైంది. మైనింగ్‌కు ఇచ్చిన భూమి గడువు పెంచాలని దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం నిరాకరించింది. మైనింగ్‌కు ఇచ్చిన భూమిలోనే తప్పుడు సర్వే నంబరు(44/4) తో ఈ కబ్జాలకు పాల్పడినట్టు వెల్లడైంది. శేరిలింగంపల్లి తహసీల్దార్ 2013 లో నోటీసు ఇచ్చి ఈ షెట్టర్లను తొలగించినట్టు కూడా తేలింది. కబ్జాలకు పాల్పడిన కూన సత్యంగౌడ్, బండారి అశోక్ ముదిరాజ్‌ల వెనుక బడాబాబులున్నట్టు సమాచారం. వారు వెనుక ఉండి వీరితో కబ్జాల పర్వాన్ని నడుపుతున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ భూమి తమదని చెబుతున్న వారి వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడమే కాకుండా.. తాము వేరే వాళ్లతో అగ్రిమెంట్ కుదుర్చుకున్నామని చెబుతున్నారు. వేరే వాళ్లు ఎవరనేది తేలాల్సి ఉంది. ఈ లోగా ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ఈ భూమికి ఆనుకుని ఉన్న 5 ఎకరాల చెరువు కబ్జా ప్రయత్నాలకు కూడా హైడ్రా చెక్ పెట్టింది.

# తెలంగాణ ఆగ్రోస్ భూమిని కాపాడిన హైడ్రా

**కబ్జాలకు ఆస్కారం లేకుండా కంచె నిర్మాణం**
**ప్రహరీలు నిర్మించి షెడ్డులు వేసి ఆక్రమణలు**
**కిరాయిలకు ఇచ్చుకుంటూ రూ. లక్షల్లో వసూళ్లు**





హైదరాబాద్, నవతరం: మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ మండలంలోని మౌలాలి – నాచారం విలేజ్లోని తెలంగాణ ఆగ్రోస్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ భూములను హైడ్రా కాపాడింది. సర్వే నంబరు 29/1 తో పాటు 30లలో 23.28 ఎకరాలను తెలంగాణ ఆగ్రోస్కు రాష్ట్ర ప్రభుత్వం గతంలో కేటాయించింది. అయితే ఈ భూమికు ఆనుకుని ఉన్న దుర్గానగర్, కమలాబాయ్ నగర్, బాబానగర్ కాలనీలవైపు కొంతమేర ఆక్రమణలు జరిగాయి. ఇలా ఇప్పటికే 4 ఎకరాలు కబ్జాకు గురయ్యింది. ఇలా వరుసగా కబ్జాలు జరుగుతున్నాయని వెంటనే కబ్జాలను తొలగించి ఆగ్రోస్ భూమిని కాపాడాలంటూ తెలంగాణ ఆగ్రోస్ సంస్థ ఛైర్మెన్ కాసుల బాలరాజు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలమేరకు హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే ఇళ్లు కట్టుకుని నివాసం ఉన్న వాటిని మినహాయించారు. వాటి జోలికి వెళ్లకుండా.. ప్రీకాస్ట్ ఇటుకలతో ప్రహరీ నిర్మించి.. అందులో వేసిన చిన్న షెడ్డులను తొలగించారు. సేకరించిన చెత్తను వేరు చేసేందుకు వినియోగిస్తున్న షెడ్డులను, స్క్రాప్ దుకాణాన్ని ఖాళీ చేయించి వాటిని హైడ్రా తొలగించింది. ఇక్కడ లావణ్య అనే మహిళ తప్పుడు పత్రాలతో రెండు ఎకరాలకు పైగా చిన్న ప్లాట్లుగా చేసి అమ్మేయగా.. తెలంగాణ ఆగ్రోస్ వారు ఆమెపై నాచారం పోలీసు స్టేషన్లో కేసులు పెట్టారు. ఈ కేసుల్లో ఆమె అరెస్టు అయ్యారని తెలంగాణ ఆగ్రోస్ సంస్థ అధికారులు చెబుతున్నారు. తెలంగాణ ఆగ్రోస్లోనే పని చేస్తున్న ఉద్యోగి రాజు అనే వ్యక్తితో కలిసి 1200 గజాల ఆక్రమణలో భాగస్వామ్యం అయినట్టు ఆ సంస్థ అధికారులు తెలిపారు. అలాగే.. మహేందర్ అనే వ్యక్తి 2 వేల గజాలకు పైగా ఆక్రమమించి ప్లాట్లుగా విడదీసి.. ప్రస్తుతానికి చిన్న షెడ్డులు వేసి వాటిని కిరాయికి ఇచ్చినట్టు ఆగ్రోస్ అధికారులు ఫిర్యాదు చేశారు. వీరందరికీ ఇప్పటికే నోటీసులు ఇచ్చామని చెప్పారు. ఇలా వివిధ కట్టడాలతో ఆక్రమణలకు పాల్పడితే.. వాటిని తొలగించి.. తెలంగాణ ఆగ్రోస్కు చెందిన భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. మల్లాపూర్ డివిజన్లో ఎక్కడా నివాసాల జోలికి వెళ్లలేదని హైడ్రా స్పష్టం చేసింది.

# సంక్షోభం వేళ భారీగా పతనమైన ఇండిగో షేర్లు




దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సంక్షోభం కొనసాగుతోంది. వరుసగా ఏడోరోజైన సోమవారం కూడా ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, ముంబై సహా దేశ వ్యాప్తంగా 400కిపైగా విమానాలు రద్దయ్యాయి. దీంతో వేలాది మంది ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. ఇక ఈ సంక్షోభం వేళ ఇండిగో షేర్లు భారీగా పడిపోయాయి . ఇండిగో మాతృసంస్థ అయిన ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్ ధర నేడు పడిపోయింది. సోమవారం ట్రేడింగ్ ప్రారంభంలో ఏకంగా 7 శాతం పతనమైంది. ఆ తర్వాత కొద్దిగా కోలుకొంది. ఉదయం 10 గంటల సమయంలో షేర్లు రూ.5,160 వద్ద, 3.92 శాతం (రూ.210.50) నష్టంతో ట్రేడవుతున్నాయి. ఇక గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో ఈ షేర్ల విలువ 9 శాతానికి పైగా విలువ కోల్పోయిన విషయం తెలిసిందే. రోజుకు సుమారు 2,300 విమానాలు ఇండిగో ఎయిర్‌లైన్స్ నడుపుతున్నది. దీంతో దేశీయ విమానయాన మార్కెట్‌లో దాదాపు 65 శాతం ఆ సంస్థ ఆధీనంలో ఉన్నది. ఈ నేపథ్యంలో విమాన ప్రయాణికులు ఇండిగోపైనే ఎక్కువగా ఆధారపడ్డారు. అయితే ప్రభుత్వ మార్గదర్శకాల నేపథ్యంలో పైలట్ల కొరత ఎదురైంది. దీంతో డిసెంబర్ 2 నుంచి రోజుకు వేల సంఖ్యలో విమాన సర్వీసులను ఇండిగో రద్దు చేసింది. ఈ నేపథ్యంలో లక్షలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ దర్యాప్తునకు ఆదేశించింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలతో ఇండిగో ఎయిర్‌లైన్స్ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. విమాన సర్వీసుల పునరుద్ధరణను వేగవంతం చేసింది. శనివారం 1,500, ఆదివారం 1,650 విమానాలు నడిపింది. 138 గమ్యస్థానాలలో 135కి కనెక్టివిటీని పునరుద్ధరించింది. అలాగే ప్రయాణికులకు రూ.610 కోట్ల భారీ మొత్తాన్ని తిరిగి చెల్లించింది. ప్రభావిత ప్రయాణికులకు సుమారు 3,000 సామగ్రిని ఇండిగో తిరిగి ఇచ్చినట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది.





# అయ్యప్ప మాలధారణ... సర్వపాప హరణం

## బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

కుత్బుల్లాపూర్, నవతరం: గాజులరామారం డివిజన్ ఉమాదేవి నగర్ లో నిర్వహించిన అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....అయ్యప్ప మాలధారణ... సర్వపాప హరణమని, అయ్యప్ప ఆజ్ఞ లేనిదే మాలధారణ సాధ్యం కాదన్నారు. ఆ అయ్యప్ప దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, సుంకరి చందు, సమ్మయ్య యాదవ్, బోయిని మహేష్, రాములు గౌడ్, కరుణాకర్, వాహిద్, ప్రసాద్, శ్రవణ్, శివా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇమ్యూటెప్‌తో రెడ్డీస్ జట్టు క్యాన్సర్ ఔషధం కోసం డీల్

న్యూఢిల్లీ, డిసెంబర్ 8: క్యాన్సర్ ఔషధం (ఎఫ్టిలాగిమోడ్ అల్ఫా–ఎఫ్టి) అభివృద్ధి, దాని వ్యాపారం కోసం డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, ఇమ్యూటెప్ లిమిటెడ్ సోమవారం జట్టు కట్టాయి. ఇరు సంస్థలకు చెందిన అనుబంధ సంస్థలైన ఇమ్యూటెప్ ఎస్ఏఎస్, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ ఎస్ఏ ఓ లైసెన్సింగ్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ వ్యూహాత్మక నిర్ణయంలో భాగంగా క్యాన్సర్, ఆటోఇమ్యూన్ వ్యాధులే లక్ష్యంగా కంపెనీలు పనిచేయనున్నాయి. ఉత్తర అమెరికా, యూరప్, జపాన్, చైనా మినహా మిగతా దేశాల్లో ఈ ఔషధం అందుబాటులో ఉంటుందని రెండు కంపెనీలు ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి.



## ఈ చిన్న ట్రిక్స్ సహాయంతో డీప్ ఫేక్స్‌ను ఈజీగా గుర్తించవచ్చు

సమాచార ప్రవంతిగా, కాలక్షేపానికి వేదికగా, సృజనాత్మకతకు భూమికగా వెలుగొందుతున్న సామాజిక మాధ్యమాల్లో పొంచి ఉన్న ప్రమాదాలెన్నో! హ్యాకింగ్, ట్రోలింగ్, ఇన్‌ఫ్లూయెన్స్ ఇలా రకరకాల జాడ్యాలు సోషల్ మీడియాను పట్టిపీడిస్తున్నాయి. డీప్‌ఫేక్స్ కూడా ఈ కోవకే చెందుతుంది. కృత్రిమ మేధను ఉపయోగించి నమ్మేలా చేస్తారు. అందినంత దోచుకొని నట్టేట ముంచుతారు. కొన్నిసార్లు మన అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని ఆన్‌లైన్‌లో అభాసుపాలు చేసే ప్రమాదమూ ఉంది. డీప్‌ఫేక్స్ ఎలా టార్గెట్ చేస్తాయి? వాటిని ఎలా ఎదుర్కోవాలో తెలుసుకుందాం.. ఆఫీస్ పనిలో బిజీగా ఉన్నాడు తనీశ్. అమెరికాలో ఉన్న బాస్ ఏదో అర్జెంట్ అసైన్‌మెంట్ ఇచ్చాడు. గంటలోగా అది పూర్తి చేయాలి. ట్రబుల్‌షూట్ చేస్తున్నాడు. ఇంతలో బాస్ నుంచి మెయిల్! కంగారుగానే ఓపెన్ చేశాడు. 'మై కార్డ్స్ బ్లాక్డ్.. నీడ్ 2 లాక్స్ మనీ ఎమెర్జెన్సీ. ట్రాన్స్‌ఫర్ టు దిస్ నంబర్' అని సందేశం. చూస్తే బాస్ మెయిల్ ఐడీతోనే వచ్చింది. పైగా కంపెనీ అఫీషియల్ డొమైనే ఉంది! అమెరికాలో బాస్ ఎంత అవసరంలో ఉన్నాడో అని.. మెయిల్‌లో సూచించిన నంబర్‌కు డబ్బులు పంపాడు తనీశ్. కాసేపటికి బాస్ ఇచ్చిన టాస్క్ కూడా పూర్తిచేశాడు. 'గుడ్ జాబ్' అని బాస్ నుంచి సందేశం. పొంగిపోయాడు తనీశ్. వారం గడిచింది. అమెరికా నుంచి బాస్ వచ్చాడు. టూర్ సక్సెస్ అయిందని ఆఫీస్ స్టాఫ్‌కు పార్టీ ఇచ్చాడు. తనీశ్ పనితనాన్ని మెచ్చుకున్నాడు. మంచి అప్రైజల్ కూడా ఇచ్చాడు. 'అన్నీ బాగానే ఉన్నాయి కానీ, ఆ రెండు లక్షల ముచ్చట ఎత్తడేంటి?' అని లోలోపల సతమతమవుతున్నాడు తనీశ్. ఒక వారం గడిచాక.. పర్సనల్‌గా వెళ్లి 'సర్, యూఎస్ టూర్‌లో ఇబ్బందిపడ్డట్టున్నరు. మీరు అడిగిన సమయానికి నా దగ్గర డబ్బు ఉండటం, మీకు పంపడం సంతోషంగా ఉంది' అన్నాడు. బాస్ ముఖం వివర్ణమైంది. 'ఏ డబ్బులు' అన్నాడు బాస్. తనీశ్ షాక్ అయ్యాడు. అంతలోనే తేరుకొని 'అదేసార్, మీరు మెయిల్ పంపారు కదా! క్రెడిట్ కార్డ్స్ నాట్ వర్కింగ్.. రెండు లక్షలు పంపమ'ని మెయిల్ చేశారుగా. బాస్ ముఖం ఎర్రబడింది. 'నేను మెయిల్ చేయడమేంటి..? ఏం మాట్లాడుతున్నవ్' అని నిలదీసినంత పనిచేశాడు. మెయిల్ చూపించాడు తనీష్. అది పంపింది తను కాదని బాస్ తేల్చిచెప్పాడు. పోలీసులు ఆరాతీస్తే అది డీప్‌ఫేక్స్ మాయ అని తేలింది. లబోదిబోమనడం తనీశ్ వంతైంది.

**బుట్టలో పడొద్దు**

ఒక్క తనీశ్ మాత్రమే కాదు.. ఇలాంటి డీప్‌ఫేక్స్ బాధితులు వేలల్లో ఉంటున్నారు. సోషల్ ఇంజినీరింగ్ నేరాల్లో దీని హవా నడుస్తున్నది. వాట్సాప్‌లో, ఫేస్ బుక్‌లో, ఇన్‌స్టాలో ఈ బెడద ఇటీవల పెరిగింది. ఫేస్‌బుక్ హ్యాక్ చేయడం, సదరు అకౌంట్‌లో ఉన్న ఫ్రెండ్స్‌కు డబ్బులు కావాలని సందేశాలు పంపి బురిడీ కొట్టిస్తున్నారు సైబర్ నేరగాళ్లు. సీఈవో పేరుతో కంపెనీ ఉద్యోగులకు, ప్రభుత్వ ఉన్నతాధికారుల పేరుతో రాజకీయ నాయకులు, కిందిస్థాయి ఉద్యోగుల దగ్గర దోచుకుంటున్నారు. అనుమానం రాకుండా అచ్చుగుద్దినట్టు వాళ్ల గళంతోనే వాయిస్ మెసేజ్‌లు కూడా పంపుతుండటం గమనార్హం. ఫేస్ మార్ఫింగ్‌తో అచ్చు వాళ్లలాగే కనిపిస్తూ కనికట్టు చేస్తున్నారు. పెద్దవారిగా పరిచయం చేసుకొని వ్యక్తిగత సమాచారాన్ని లూటీ చేసి, తర్వాత బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో తనకు కావాల్సినవాళ్ల పరిస్థితి దయనీయంగా ఉందని, ఆర్థికంగా చేయూత ఇవ్వాలంటూ కోరుతున్నారు. సంఘంలో పలుకుబడి ఉన్న వ్యక్తుల రూపంతో ఫేక్ వీడియో గానీ, ఆడియో గానీ రూపొందించి స్వార్థ ప్రయోజనాలకు వాడుతున్నారు. ఇవి నిజమని గుడ్డిగా నమ్మితే.. ఆర్థికంగా నష్టపోవాల్సి రావచ్చు. ఒక్కోసారి మానసికంగా కుంగిపోయే ప్రమాదమూ ఉంది.

## మలబద్ధకం సమస్యతో సతమతమవుతున్నారా..
## అయితే ఈ పండు మీకు చక్కటి పరిష్కారం..!



జీవితాంతం అనారోగ్య సమస్యలు లేకుండా ఎవ్వరూ ఉండరు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఏదో ఒక సమయంలో అనారోగ్య సమస్యల బారిన పడుతుంటారు. అయితే, అన్ని అనారోగ్య సమస్యలకు ఔషధాలు అక్కర్లేదు. కొన్ని సమస్యలకు చిన్నచిన్న చిట్కాలే చక్కటి పరిష్కారం చూపిస్తాయి. సమస్యను బట్టి వంటింటి పదార్థాలు, పండ్లు, కూరగాయలు పరిష్కారానికి తోడ్పడుతాయి. ఔషధం అక్కర్లేని అనారోగ్య సమస్యల్లో మలబద్ధకం కూడా ఒకటి. ఈ సమస్యకు అరటిపండు మంచి ఔషధంగా పనిచేస్తుంది. అరటిపండులో కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్స్ పుష్కలంగా ఉంటాయి. ఈ పండు సులభంగా జీర్ణం కూడా అవుతుంది. అందుకే డాక్టర్లు రోజూ ఒక అరటిపండు తినాలని సూచిస్తుంటారు. ఈ పండుతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

**ఇవీ ప్రయోజనాలు..**

అరటిపండులో పొటాషియం ఎక్కువ మోతాదులో ఉంటుంది. కాబట్టి ఎముకలు, దంతాలకు చాలా మంచిది. శరీర కండరాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ పండులో ఉండే పోషకాలు ఆస్తమా, అధిక రక్తపోటు, క్యాన్సర్ నివారణలో కూడా తోడ్పడుతాయి. కిడ్నీల ఆరోగ్యానికి కూడా అరటిపండు దివ్యౌషధంగా పనిచేస్తుంది. వారానికి రెండు లేదా మూడు అరటిపండ్లు తినడంవల్ల కిడ్నీ సంబంధిత జబ్బుల బారినపడే ముప్పు నుంచి తప్పించుకోవచ్చు. అరటిపండులో పీచుపదార్థం ఎక్కువగా ఉంటుంది. అందుకే మలబద్ధకానికి ఇది మంచి మందు. ఈ పండులో కొవ్వులు తక్కువ మోతాదులో ఉంటాయి. కాబట్టి బరువు తగ్గాలనుకునే వారికి మంచిది. ఇందులో ఉండే పిండిపదార్థం కడుపు నిండిన భావన కలిగించి, ఆకలిని తగ్గిస్తుంది. అంతేగాక అరటి పండు పేగులను ఉత్తేజపరుస్తుంది. దీనివల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. అరటి పండులో ఉండే 'బాన్‌లెక్' అనే రసాయనానికి ఎయిడ్స్ వైరస్‌పై పోరాడే శక్తి ఉందని ఓ రిసెర్చ్‌లో తేలింది. ప్రస్తుతం ఈ వైరస్ నిరోధానికి వాడుతున్న 'టీ20, మారావిరాక్' మందులతో సమానంగా ఈ రసాయనం పనిచేస్తుంది. లెక్టిన్ రసాయనం వైరస్‌ను శరీరంలో ప్రవేశించకుండా అడ్డుకుని ఇన్‌ఫెక్షన్‌ను నిరోధిస్తుంది. అదేవిధంగా అరటి పండులో ఉండే ట్రిప్టోఫాన్ అనే అమైనో యాసిడ్ శరీరంలో ప్రవేశించగానే సెరటోనిన్‌గా మారుతుంది. తద్వారా ఒత్తిడి తగ్గుతుంది. మానసిక ప్రశాంతతను కలుగజేస్తుంది. రాత్రిపూట పాలతో కలిపి అరటిపండు తీసుకుంటే నిద్ర బాగా పడుతుంది.

## నిమ్మకాయతో ఆరోగ్యానికి ఆరోగ్యం,
## అందానికి అందం.. ఎలాగో తెలుసా..?

నిమ్మకాయ.. ఇది సిట్రస్ జాతికి చెందిన ఒక రకం కాయ..! ఈ నిమ్మకాయ ఆరోగ్యానికి ఔషధంగా, అందాన్ని ఇనుమడింపజేసే ఆయుధంగా పనిచేస్తుంది. అంతేగాక నిమ్మకాయతో ఇంకా ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. ఎండా కాలంలో ఒంట్లో వేడిని తగ్గించడానికి, అలసిపోయిన దేహానికి తక్షణమే హుషారు తెప్పించడానికి నిమ్మ తోడ్పడుతుంది. రుచికరమైన పులిహోర చేసుకోవడానికి, కమ్మటి తొక్కు పెట్టుకోవడానికి కూడా నిమ్మకాయలు ఉపయోగపడుతాయి. ఇలా చెప్పుకుంటూపోతే నిమ్మతో లెక్కలేనన్ని ప్రయోజనాలున్నాయి. మరి అవేంటో చూద్దామా..!

**నిమ్మకాయతో లాభాలు..**

నిమ్మకాయలు సీజనల్ రోగాలు ధరిచేరకుండా శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తరచూ నిమ్మరసం (Lemon juice) తాగడం ద్వారా ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుకోవచ్చు. నిమ్మరసం యాంటీసెప్టిక్‌గా పనిచేస్తుంది. నిమ్మలో కావాల్సినంత సి విటమిన్ లభిస్తుంది. తరచూ నిమ్మరసం తీసుకునే వారిలో వయసు పెరుగుతున్నా చర్మం అంత త్వరగా ముడుతలు పడదు. దీంతో వృద్ధాప్య చాయలు త్వరగా దరిచేరవు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం కొంచెం గోరువెచ్చని నీళ్లలో నిమ్మరసం కలుపుకుని తాగితే మానసిక ఒత్తిడి తగ్గి, నూతన ఉత్సాహం వస్తుంది. పంటినొప్పిని తగ్గించడంలో కూడా నిమ్మరసం తోడ్పడుతుంది. నిమ్మలోని సిట్రిక్ యాసిడ్ పంటిలోని కణజాలాన్ని మొద్దుబారేలా చేస్తుంది. అదేవిధంగా చిగుళ్లలోంచి రక్తం వచ్చేవారు తరచూ నిమ్మరసం తీసుకోవడంవల్ల ప్రయోజనం ఉంటుంది. కాలేయంలో పేరుకున్న విష పదార్థాలను తొలగించి, శుద్ధి చేయడంలో కూడా నిమ్మరసం మంచి ఉపకారిగా పనిచేస్తుంది. వేసవిలో నిమ్మరసం తాగితే అలసట నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. స్థూలకాయం ఉన్నవారు ప్రతిరోజు ఉదయం గోరువెచ్చని నీళ్లలో నిమ్మరసం కలుపుకుని తాగితే ప్రయోజనం ఉంటుంది. అంతేగాక నిమ్మలోని సిట్రిక్ యాసిడ్ కిడ్నీల్లో ఏర్పడే రాళ్లను కరిగించడంలో తోడ్పడుతుంది.



## వైట్ షుగర్ కంటే బ్రౌన్ షుగర్ బెటర్.. ఎందుకో తెలుసా..?



బీపీ, షుగర్, థైరాయిడ్, గ్యాస్ ట్రబుల్, ఆస్తమా లాంటి అనారోగ్యాల బారిన పడకుండా ఉండాలన్నా, ఇప్పటికే అలాంటి అనారోగ్యాలు ఉన్నవాళ్లు వాటిని అదుపులో పెట్టుకోవాలన్నా బ్రౌన్ కలర్ రైస్, బ్రౌన్ కలర్ బ్రెడ్ లాంటివి ఎక్కువగా తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. తాజాగా బ్రౌన్ కలర్ షుగర్ (%దీతీశీఉఅ జశీశ్రీశీబతీ ాబస్త్రుతీ%)ను కూడా వైద్య నిపుణులు రిఫర్ చేస్తున్నారు. బ్రౌన్ రంగు చక్కెరతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని చెబుతున్నారు. మరి బ్రౌన్ కలర్ షుగర్‌లో ఉన్న గొప్పతనం ఏమిటో..? బ్రౌన్ షుగర్‌ను వినియోగించడంవల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం..! వైట్ షుగర్ కంటే బ్రౌన్ రంగు షుగర్ (%దీతీశీఉఅ ంబస్త్రుతీ)%?లో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. అంతేగాక వైట్ షుగర్ ఎక్కువగా తీసుకోవడంవల్ల కేలరీలు పెరుగుతాయి. దానివల్ల బరువు కూడా పెరిగే ప్రమాదం ఉంది. కానీ, బ్రౌన్ షుగర్‌ను చెరుకు నుంచి కాకుండా నేరుగా బెల్లం నుంచి సేకరిస్తారు. అందుకే ఇది ఆరోగ్యానికి చాలా మంచిది. బ్రౌన్ షుగర్‌లో పొటాషియం, జింక్, రాగి, భాస్వరం, విటమిన్ బి-6 వంటి పోషకాలు ఉంటాయి. ఈ పోషకాలు ఆరోగ్యానికి మంచివి. బ్రౌన్ షుగర్ తీసుకోవడంవల్ల జీర్ణ సమస్యలు తొలగిపోతాయి. దాంతో మలబద్ధకం సమస్య కూడా తీరుతుంది. ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో అల్లం ముక్క, ఒక టీస్పూన్ బ్రౌన్ షుగర్ కలిపి తీసుకోవాలి. అదేవిధంగా కాళ్లు, చేతుల్లో తిమ్మిర్లను తగ్గించడానికి బ్రౌన్ షుగర్ సహాయపడుతుంది. ఇందులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది కాబట్టి తిమ్మిర్లతోపాటు నొప్పిని తగ్గిస్తుంది. బ్రౌన్ షుగర్‌లో కేలరీలు తక్కువగా ఉండటంవల్ల బరువు తగ్గడానికి కూడా తోడ్పడుతుంది. అలాగే జీవక్రియలను మెరుగుపరుస్తుంది.అదేవిధంగా బ్రౌన్ షుగర్‌లో విటమిన్ బి6, నియాసిన్, పాంతోతెనిక్ ఆమ్లం, ఇతర ఖనిజాలు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మం కోసం యాంటీ ఏజింగ్ కాంపోనెంట్?గా పనిచేస్తాయి. అలాగే చర్మంపై మృత కణాలను తొలగించే స్క్రబ్?గా పనిచేస్తాయి. బ్రౌన్ షుగర్ యాంటీ అలర్జీ లక్షణాలను కూడా కలిగి ఉంటుంది. అందుకే ఇది ఉబ్బసం రోగులకు చికిత్సలో సాయపడుతుంది.బ్రౌన్ షుగర్ బ్యాక్టీరియా, ఇన్‌ఫెక్షన్‌లతో పోరాడటానికి తోడ్పడే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంటుంది.

WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com

## ఆరుతడి.. సిరుల దిగుబడి

యాసంగిలో ఆరుతడి పంటలు పండించిన రైతులకు సిరుల వర్షం కురుస్తున్నది. అన్నదాతలు తక్కువ సమయంలోనే ఎక్కువ లాభాలను ఆర్జిస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవడం.. చెరువులు, కుంటలు, కాలువల్లో పుష్కలంగా నీరుండడంతో యాసంగిలో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా గత సీజన్ కన్నా 43 వేల ఎకరాల్లో పంటలు అధికంగా సాగయ్యాయి. ఇందులో ఆరుతడి పంటలైన మక్కజొన జొన్న, శనగ పంటల సాగు విస్తీర్ణం గత ఏడాదితో పోలిస్తే భారీగానే పెరిగింది. ప్రభుత్వం రైతులను ప్రతి వానకాలం, యాసంగి సీజన్లలో మొత్తానికి మొత్తం వరి పంటనే వేయకుండా ఇతరత్రా వాణిజ్య, ఆరుతడి పంటలు వేసుకోవాలని వ్యవసాయాధికారుల ద్వారా అవగాహన కల్పిస్తున్నది. అయితే కొంతమంది రైతులు వ్యవసాయాధికారుల సూచనలను పట్టించుకోకపోగా కొందరు రైతులు మాత్రం ఇతర పంటలు వేసి లాభాలను ఆర్జించారు. దీంట్లో భాగంగానే ఈ సంవత్సరం యాసంగి పంటలో జొన్న, మక్కజొన్న వేసిన రైతులు వరి పంటకు మించి లాభాలు రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ధర్పల్లి మండలంలోని మైలారం, సల్లగరిగె గ్రామాల్లోని రైతులు సుమారు 200 ఎకరాల మేర జొన్న పంట వేశారు. రైతులు ప్రధానంగా జొన్న విత్తనాలు అందించిన కంపెనీతోనే బైబ్యాక్ ఒప్పందం చేసుకున్నారు. దిగుబడి సైతం ఎకరాకు సుమారు 30 క్వింటాళ్లకు రావడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మద్దతు ధర సైతం క్వింటా లుకు రూ.5వేలకు పైనే మద్దతు ధర చెల్లించి విత్తన కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయి. ఈ లెక్కన వరి పంటతో పోలిస్తే ఎంతో మేలని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ యాసంగి పంటలో వరికి బదులు మక్కజొన్న పంటలు వేసిన రైతులు సైతం అధిక లాభాలను ఆర్జించారు. మండలంలో సుమారు 350 ఎకరాల మేర మక్కజొన్న పంటను వేయగా ప్రభుత్వం ప్రకటించిన రూ.1960ల మద్దతు ధర కన్నా ఎక్కువగానే వెచ్చించి ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. ఎకరానికి 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మక్కజొన్నకు మొదట రూ.2,100 నుంచి రూ.2,200 వరకు కూడా క్వింటాలుకు మద్దతు ధరను చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేశారు. దీంతో వరికి బదులు మక్కజొన్న పంట వేసినందుకు దిగుబడి బాగా వచ్చి మద్దతు ధర సైతం బాగా రావడంతో ఖర్చులు పోను నాలుగు రాళ్లు మిగిలాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

Owned and Published by Sirigiri Varadaraju, Printed at: Shesha Sai Enterprises, Plot No. 98/1, CIE, Phase 2, Gandhinagar, Hyderabad - 37, Telangana State, India, RNI No: APTEL/2018/76747, Bureau Chief Telangana: Dr. Narsimlu Yellampally, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India